## కథ

# పురావస్తుతత్వం

**వి.హేమ**

నేను,గుమ్మంలో బైక్ దిగి మెట్లు ఎక్కుతూంటే "రండి రండి! మీ కోసమే చూస్తున్నా" అంటూ ముస్తాబు మీద ఉన్న సుబ్బలక్ష్మి నవ్వుముఖంతో ఎదురుగా వచ్చేసరికి ఆశ్చర్యంతో తెల్లముఖం వేశా. సుబ్బలక్ష్మి నా భార్య!

సాధారణంగా ఆ సమయంలో ఎవరూ ఇంట్లో ఉండరు. సుబ్బులు లేడీస్ క్లబ్‌కి, పిల్లలు ఫ్రెండ్సుకోసం ఇల్లు వదిలి వెళ్లిపోగా, ఆఫీసులో అలసిపోయి ఇంటికి వచ్చిన నాకు ఎదురుగా కనిపించేది గొళ్లానికి వేళ్లాడుతున్న బోదురు కప్పలాంటి తాళం కప్ప మాత్రమే! అలాంటిది ఆరోజు సుబ్బులు గుమ్మంలో నాకోసం ఎదురుచూస్తూ కనిపించడం నిజంగానే నాకు ఆశ్చర్యమనిపించింది.

"ఏమిటి విశేషం" అని అడుగుతూ లోపలకు వచ్చా.

నేను బూట్లు విప్పి, బట్టలు మార్చుకునే ప్రయత్నం చేస్తూంటే చూసి వారించింది సుబ్బలక్ష్మి.

"ఆగండి. బట్టలు మార్చుకోవద్దు. మనం అలా ఒక్క అడుగు బుచ్చబ్బాయ్ గారింటికి వెళ్లి వచ్చేద్దాం. అట్టే దూరం కాదు, పక్కవీధే!"

"ఎవరా బుచ్చబ్బాయ్, ఏమా కథ?" చొక్కా విప్పబోతూ, మానేసి అడిగాను, ఇంతవరకూ ఆ పేరు నాకు పరిచితమైనది కాకపోడంతో.

"మొన్నామధ్య నేను వాళ్ళింటికి వెళ్ళి చూసొచ్చా. ఇంటినిండా అవే! ఎంత బాగున్నాయో! ఒకసారి మిమ్మల్ని కూడా తీసుకెళ్లి.."

"నాకేం అర్థం కావడం లేదు. ఏమిటవి?" నాకంతా ఒక రిడిల్‌లా ఉంది.

"యాంటిక్సు అండీ, యాంటిక్సు! ఎంత పురాతనమైనవి ఉన్నాయో వాళ్లింట్లో- ఒకటి రెండూ కావు. బోలెడున్నాయి. గజనీ కాలం నాటి గడియారం, అక్బర్ వాడిన టీసెట్, శివాజీ సేనాని తాలూకు కొమ్ము బూరా- ఓహ్, ఎన్నని ప్రతిదానికీ ఓ చరిత్ర ఉంది, తెలుసా!"

"ఏమిటి సుబ్బూ! అక్బర్ కాలంలో కూడా టీ తాగేవారా? ఆ విషయం నేనే చరిత్ర పుస్తకంలోనూ చదవలేదు, తెలుసా!" అన్నా.

నేను మాష్టర్సు డిగ్రీ తీసుకున్నది చరిత్రతోనే అన్నది గుర్తుచేసుకొంటూ.

"మీదంతా వితండం, పోదురూ! ఒక్కసారి వెళ్లి చూసివచ్చాక మీకే తెలుస్తుంది వాటి సంగతి. కాఫీ తాగండి, ఒక్కసారి వెళ్లి వచ్చేద్దాం" అంటూ నా చేతికి ఘుమ ఘుమలాడుతూ పొగలు కక్కుతున్న కాఫీ కప్పు అందించింది సుబ్బులు.

కాఫీ 'సిప్' చేస్తూ ఫేన్ క్రింద కూర్చున్నా. ఇంతలో గుమ్మంలో కారు ఆగిన చప్పుడైతే తొంగి చూశా. గుమ్మంలో ఆగి ఉన్న పాత అంబాసిడర్ కారులోంచి చిన్నా పెద్దా జనం దిగుతున్నారు. అప్పటికే పదిమంది దిగి క్రింద నిలబడ్డారు. ఇంకా దిగవలసిన జనం కార్లో ఉన్నారు. 'ఎవరురా బాబూ వీళ్లు' అనుకున్నా. సుబ్బులు ముఖంలో గబగబా రంగులు మారాయి. ముఖానికి నవ్వు పులుముకుని వాళ్లని లోపలకు ఆహ్వానించింది "రండి రండి! ఎన్నాళ్లకెన్నాళ్లకు" అంటూ.

అందరినీ ఫార్మల్‌గా ఒకసారి విష్ చేసి నేను చల్లగా నా గదిలోకి జారుకున్నా. వచ్చిన వాళ్లెవరో నాకు తెలిసినవాళ్లు కారు. అందుకని బట్టలు మార్చుకోకుండానే కుర్చీలో కూర్చుని, చదువుదామని 'ఇండియా టుడే' చేతిలోకి తీసుకున్నా. కానీ చదువు సాగలేదు. ఇల్లంతా గందరగోళంగా ఉంది. కాసేపలా తిరిగి వద్దామని లేచి హాల్లోకి వచ్చి చెప్పులు తొడుక్కుంటున్నా.

"ఏమండోయ్! ఒక్కసారి ఆగండి" అంటూ పరుగున వచ్చింది సుబ్బులు. ముందుకు సాగవలసిన నా కాళ్లకు బ్రేకులు పడ్డాయి.

డ్రాయర్‌లోంచి ఒక కార్డు తీసి నా చేతిలో ఉంచి చెప్పింది సుబ్బలక్ష్మి. "ఇటు చూడండి, మనం వస్తున్నామని వాళ్లకి నేను ఇందాకనే ఫోన్ చేసి చెప్పానేమో? వాళ్లు ఈపాటికి మనకోసం కనిపెట్టుకుని ఉంటారు. మీరైనా వెళ్లి చూసి వస్తే మాట దక్కుతుంది" అన్యాపదేశంగా నాకొక్కడికే వినిపించేలా చెప్పింది.

"వాళ్లెవరో నాకు పరిచయం లేదు కదా! నువ్వు రాకుండా ఎలా వెళ్లను?"

"అబ్బ, వెళుదురూ! వీళ్లు అప్పుడే వెళ్లేలా లేరు. అయినా నేను చూడ్డం ఎప్పుడో అయ్యింది. ఇక మీరే చూడవలసి ఉంది. వాళ్లు చాలా కలివిడైన మనుషులు. చక్కగా అన్నీ వివరించి చెపుతారు. మీరు వెళ్లి చూస్తే ఒకసారి మీకూ తెలుస్తుంది వాటి విలువ. ఆ తరువాత ఇంచక్కా మనం కూడా కొనుక్కోవచ్చు. అలాంటి పురావస్తు సంపద కలిగి ఉండడం కూడా ఒక అదృష్టం. పెట్టి పుట్టాలి!"

నిజమే! ఇన్నాళ్లా చూడకుండానే సుబ్బులు 'యాంటిక్సు' కొందాం- అన్నప్పుడల్లా ఒద్దని అడ్డుపడుతున్నా, మేమూ కొత్త యిల్లు కట్టుకున్నాం కదా! ఒకసారి వెళ్లొస్తే ఏం పోయింది- అనుకుంటూ గుమ్మం దిగా.

పెద్దగా వెతుక్కోకుండానే దొరికింది బుచ్చబ్బాయ్ గారి యిల్లు. బ్రహ్మాండమైన మేడ, ముందు భాగంలో పెద్ద గార్డెన్! చాలా భాగ్యవంతుల్లా వున్నారు. నేను బైక్ దిగేసరికి భార్యాభర్తలిద్దరూ బయటికి వచ్చి ఆప్యాయంగా నన్ను ఆహ్వానించారు. నేను ఒక్కణ్ణే వస్తున్నట్లుగా సుబ్బులు ఫోన్ చేసి చెప్పిందిట. వాళ్లిద్దరూ వయసులో పెద్దవాళ్లు. ఆదిదంపతుల్లా ఉన్నారు. వాళ్లకి పిల్లలు లేరుట! సుబ్బులు చెప్పింది నాకు. నేను టూకీగా నన్ను గురించి చెప్పుకుని వాళ్లు కూర్చోమని చూపించిన ఖరీదైన సోఫాలో కూర్చున్నా. ఆ గదంతా కలయజూస్తున్న నాకు అక్కడి సామాను అమరికలో ఏదో విచిత్రం ఉన్నట్లుగా తోచింది. ఆశ్చర్యంగా చూస్తున్నా.

"ఓ! మీ దృష్టి ఆ గడియారం మీదే పడిందా? ఎవరొచ్చినా ముందు పలకరించే వస్తువు అదే" అన్నాడు బుచ్చబ్బాయిగారు కళ్లు విశాలంగా చేసి.

వెంటనే అందుకొంది సావిత్రమ్మ, వారి శ్రీమతి "అది చాలా అందంగా ఉంది కదూ" అంటూ మహమ్మదు గజనీ అని మనం హిస్టరీ బుక్కుల్లో చదివాం కదూ- ఆ గజనీ కాలం నాటిది ఈ గడియారం అంటే- ఇది నిజమైన 'యాంటిక్' అన్నమాట!"

ఆ కాలంలో కూడా ఉన్నాయా యిలాంటి గడియారాలు! ఏమో, ఎవరికెరుక. ఏ బుక్కులోనూ ఈ విషయం చదివిన గుర్తులేదు నాకు. కాని, ఏదో ఒకటి మాట్లాడకపోతే బొత్తిగా బాగుండదనిపించింది. "ఇది నడుస్తుందా" అని అడిగా.

"ఇంకా నయం!" భార్యాభర్తలిద్దరూ ఏకగ్రీవంగా అరిచారు.

"ఆరి భగవంతుడా! అయితే మీకు యాంటిక్సుతో పరిచయం లేదన్నమాట! అది పనిచెయ్యలేకపోడమే 'యాంటిక్' అన్న దానికి తొలి గుర్తు" అంది సావిత్రమ్మ.


"అసలు అది ఎప్పుడైనా పనిచేసిందంటారా?" ఊరుకోలేక మళ్లీ అడిగా.

"నాకదేం తెలియదు అబ్బాయీ! ఆరోజుల్లో తయారైన గొప్ప గడియారాల్లో ఇదీ ఒకటి-అన్నారు. కాదంటారా? నిజానికి, ఇది అసలు ఎప్పుడైనా పనిచేసిందో లేదో నాకు తెలియదు. కాని, ఒకటి మాత్రం గట్టిగా చెప్పగలను- దాని పురావస్తుత్వానికి గుర్తు అది పనిచెయ్యకపోడమే! యాంటిక్సు పని చెయ్యాలనే ఆశ ఎప్పుడూ ఉండకూడదు" అంటూ బాగా నొచ్చుకున్నారు బుచ్చబ్బాయిగారు.

వెంటనే నేను సర్దుకోడానికి ప్రయత్నించా. "ఆ గడియారానికి అసలు ముళ్లే లేవు. ఇంక అది పనిచేస్తుంది అని ఆశించడానికేముంది లెండి" అన్నా.

బుచ్చబ్బాయిగారికి కోపం వచ్చింది కాబోలు, ఏమీ మాట్లాడలేదు. ఆయన భార్య అందుకుని చెప్పడం మొదలుపెట్టింది. "ముళ్లా! మాకు తెలిసినప్పటినుండి అది ముళ్లతో ఉన్నది లేదు! ఆగ్రాలో, తాజ్‌మహల్ పక్క

గల్లీలో, ఒక చిన్నషాపులో మా అదృష్టంకొద్దీ దొరికింది అది మాకు. ఆ షాపువాడిని సరిగా మీరిప్పుడడిగిన ప్రశ్నే అప్పుడు మేమూ అడిగాం. ఇంతకీ అతను చెప్పిందేమిటంటే- ఆ గడియారానికి ముళ్లుండడం అతడూ చూడలేదుట! అన్నీ సరిగా ఉంటే అదిపురాతన వస్తువెలాగౌతుందండీ అని ఎదురడిగాడు. ఇంతకీ వాటి వయసు చెప్పేందుకు అలాంటివే కదా మనకు కనిపించే గుర్తులు. ఆ రోజుల్లో ఆయనకూ నాకూ కూడా గడియారాలంటే చాలా మోజు ఉండేది. వాటి గురించి ఎన్నో పుస్తకాలు కూడా చదివాం. వాటివల్ల తెలిసిందేమిటంటే, కాలగమనాన్ని కొలిచే యంత్రాలు చాలా పూర్వకాలంలో కూడా ఉన్నాయనీ, కాని వాటికి ముళ్లు ఉండితీరాలన్న పట్టింపేమీ లేదనీను. అవి ముళ్లు లేకపోయినా ఆ రోజుల్లో టైం కరెక్టుగా చెప్పేవిట! మరి.."





నేను మాట మార్చే ప్రయత్నం చెయ్యకపోతే ఆ వాక్ప్రవాహం అలా ఎంతసేపు సాగేదో! నేను ఆమె మాటలకు అడ్డొచ్చి, "గడియారానికి ఆ పగులు మీరు దాన్ని కొన్నప్పుడే ఉందా" అని అడిగా. ఆ గడియారానికున్న పెద్ద పగులువైపు చూపుతూ.

అలా నేను ఆ గడియారాన్ని గూర్చి అడగడంతో బుచ్చబ్బాయిగారు తన కోపం మర్చిపోయారు. "అబ్బే, అదేం లేదు. దాన్ని నేను కొన్న తరువాతే దానికి పగులు చేయించా. ఇక ఇప్పుడు ఎవరైనా దానిని గజనీకాలం నాటి గడియారం కాదని అనగలరా? కనీసం మాటవరసకైనా? కొత్తవాటికి కాస్త రంగు మార్చి కాళ్లతో కసాపిసా త్రొక్కి, వాటిని యాంటిక్సుగా చలామణీ చేస్తున్న ఈరోజుల్లో ఆ పాటి జాగ్రత్త అవసరం. సీతమ్మవారికైనా అగ్ని పరీక్ష తప్పిందా మరి! అ పగులు చేసిన శిల్పిని పట్టుకోడానికి ఎంత శ్రమయ్యిందని!" ఆనాటి జ్ఞాపకాలతో కాబోలు ఆయన కళ్లు అరమోడ్పులయ్యాయి.

"మొత్తానికి ఎలాగైతేనేం ఆ శిల్పి మాకు దొరికాడు. ఇంతా చేస్తే అతడు మేం గడియారం కొన్న షాపుకి ఫర్లాంగు దూరంలో వున్నాడు. అతనిలో ఎంత పనివాడితనం ఉందో చూసిన వాళ్లకుగాని తెలియదంటే నమ్మండి" అంది సావిత్రమ్మ.

"నిజమా?" ఆశ్చర్యంతో అడిగా. ఆపాటి ఆశ్చర్యం అవసరమనిపించింది.

"అవును. ఇంతకీ మాకు గడియారం అమ్మిన వ్యక్తే మాకా అడ్రస్ ఇచ్చాడు."

శ్రీమతి బుచ్చబ్బాయిగారి ముఖంలో ఆనందం వెల్లివిరిసింది. "చెప్పొద్దూ! అతని పనితనం ఎంతటిదో చూడాలనిపించి, వద్దన్నా వినకుండా ఈయన వెంట నేనూ వెళ్లా. నిజంగా అదొక అద్భుతం కదూ!"

"ఏమంటారు?" అన్నట్లుగా భర్తవైపు చూసింది ఆమె.

బుచ్చబ్బాయిగారు అందుకున్నారు. "నిజంగానే అదొక అద్భుతం అంటే నమ్మండి! మేం గడియారాన్ని తీసుకెళ్లి అతని చేతిలో పెట్టాం. అతడు దాన్ని అందుకొని అటూ ఇటూ తిప్పి చూశాడు. ఆ తరువాత దాన్ని అతడు వంచమీద నిలబడేలా నేలమీద ఉంచాడు. ఆపై, ఏదో భాషలో మంత్రాల్లాంటివి ఏవో చదువుతూ కొంతసేపు దానివైపే చూస్తూ నిలబడిపోయాడు. తరువాత

దాని చుట్టూ ప్రదక్షిణాలు చెయ్యడం మొదలుపెట్టాడు. తనలో తానే ఏవేవో మాట్లాడుకుంటూనే ఉన్నాడు. ఆ ధాష్టీకం చూస్తే మాత్రం మాకు అతడు దాన్ని తిడుతు న్నాడనిపించింది, కాని ఆ భాష ఏమిటో మాకు తెలియ లేదు. అతడలా తిరుగుతూ తిరుగుతూ ఒక్కసారి ఆగి, గాలిలోకి ఎగిరి, రెండుకాళ్లా గడియారం మీద ఆనేలా ఒక్కదూకు దూకాడు. అంతే.."

"ఆ!" నోరు తెరచి విస్తుపోయా.

"ఆ...! అవును. అతడు ఎంత గురిగా దూకాడంటే, సరిగా రావలసిన చోటనే, కావలసినంత పగులువచ్చే సింది. ఇన్నాళ్లకొక తగిన మనిషి మాకు దొరికాడని చాలా సంతోషించాం. ఆ అడ్రస్ జాగ్రత్తపెట్టా, అవసరా నికి పనికి వస్తుందని, మీకు కావలసి వచ్చినప్పుడు అడ గండి ఇస్తాం"

"అవునూ" సావిత్రమ్మ గారు అందుకున్నారు. "మాకు అతనితో పరిచయం ఏ ముహూర్తాన అయ్యిం దోగాని అప్పటినుండి మేం, ఇక ఏది పగలెయ్యాలన్నా అతని దగ్గరకే తీసుకెడుతున్నాం. అతనొక అద్భుతం అనుకోండి" అంది ఆమె.

## ఇక కమల్ క్రేజ్?

విడుదలకు ముందు రజనీకాంత్ 'శివాజీ' సృష్టిం చిన హడావుడి అంతా ఇంతా కాదు. అయితే సక్సెస్ రేట్ మాత్రం ఆ స్థాయిలో లేదనేది వ్యాపారవర్గాల కథనం. అదలా వుంటే ఇంకో సినిమా గురించి హడావుడి మొదలైందిప్పుడు. కమల్ హాసన్ పది పాత్రలు పోషిస్తున్న 'దశావతారం' చిత్రం మరో సంచలనానికి తెర లేపుతుందని అంటున్నారు. కె.ఎస్.రవికుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా కూడా భారీ తారాగణంతో, భారీ బడ్జెట్‌తో నిర్మాణం పూర్తి చేసుకుంటోంది. అశిన్, మల్లికా షెరావత్ లాంటి ముద్దుగుమ్మలు కథానాయికలుగా నటిస్తున్న 'దశావతారం' దశ ఎలా వుందో?

"అవును. అది అక్షరాలా నిజం. మొన్ననామధ్య ఒక పురావస్తుతత్వం తెలిసిన ఒక గొప్ప వ్యక్తి మా యింటికి వచ్చారు. ఆయన ఈ గడియారం చూసి, ఈ గజనీకాలం నాటి గడియారం కాదని ఎవ్వరూ అనలే రని నొక్కి వక్కాణించారు. ఆయనకు ఇది ఎంత నచ్చిందో మాటలతో చెప్పలేను" అన్నారు బుచ్చబ్బా యిగారు.

శ్రీమతి భర్తకు వంతపాడింది. "అవును. ఆయన గడియారం మీదున్న ఈ పగులు మేము చేయించిం దని ఎంతమాత్రం గుర్తుపట్టలేకపోయాడు. పైగా అన్నాడూ - ఈ గడియారాన్ని ఎవరో కోపం వచ్చి మూడో అంతస్తు మీద నుంచి క్రిందికి విసిరేసి ఉంటారు. అందుకే ఈ పగులు వచ్చింది అన్నారు"

నేను బలవంతంగా నవ్వు ఆపుకోవాల్సి వచ్చింది.

ఆ భార్యాభర్తల్ని చూస్తుంటే నాకు తమాషాగా అని పించింది. "మేడ్‌ఫర్ ఈచ్ అదర్!" మనసులోనే నవ్వు కున్నా.

"ఓసారి ఏమయ్యిందనుకున్నారూ" సావిత్రమ్మే చెప్పసాగింది.

"సాధారణంగా నా అంచనా తప్పవు. ఒకే ఒక్కసారి మాత్రం నేను పప్పులో కాలు వెయ్యడం జరిగింది. ఒక యాంటిక్సు షాపులో నేనొక పప్పు గరిట కొన్నా. అది పదకొండో శతాబ్దం నాటిదని నా అంచనా. కానీ అది పదో శతాబ్దంలోనే తయారయ్యిందట! ఈయన చాలా రోజులు అది చెప్పి నన్ను తరచూ ఆట పట్టించేవారు. అవునా" అని అడుగుతూ ఆనాటి జ్ఞాపకాలతో ఆమె ముసి ముసి నవ్వులు నవ్వుకుంది.


"ఆ! అవును. సరే, ఇక టీ త్రాగుదామా" అంటూ లేచారు బుచ్చబ్బాయి.

మేము ముగ్గురం లేచి డైనింగ్ హాల్‌కి నడిచాము. డైనింగ్ హాలు కూడా చాలా ఖరీదైన వస్తువులతో నిండి ఉంది. కర్రసామాను కూడా మంచి నగిషీ పనితో అది సంపన్నుల ఇల్లని చెప్పకనే చెపుతున్నట్లుగా ఉంది. విశాలమైన డైనింగ్ టేబుల్ మీద, లోపల పింగాణీ గిన్నెలుండి పైన అందమైన డిజైన్లు ఉన్న వెండి టీ సెట్ ఉంది మెరిసిపోతూ.

టీ కప్పుల్లోకి వంచుతూ, "మీకు యాంటిక్సు అంటే ఇష్టం ఉంది కనుక మీరు నా 'టీ పాట్' చూసి తీరాలి" అన్నారు బుచ్చబ్బాయ్ గారు.

ఆ 'టీపాట్' నిజంగానే చాలా బాగుంది. ఎవరు చేశాడోగాని మంచి పనితనం చూపిం చాడు. పాలిష్ కూడా అద్దంలా మెరుస్తోంది!

"అవును సార్! టీ పాట్ చాలా బాగుంది" అన్నా దానిని వేలితో రాస్తూ. "ఇది చాలా ఖరీదు



ఉండి ఉంటుంది. ఆ పనితనం.."

బుచ్చబ్బాయిగారు నా మాట పూర్తవ్వనియ్యలేదు. "ఆ! దీని గురించి చెప్పేందుకేముంది? ఇది మొన్నీమధ్య ఈ ఊళ్లో కొన్నదే. ఇది తయారై నిండా ఐదు సంవత్సరా లైనా అయ్యి ఉండదు. పైగా తొలిసారి దీనిని కొన్నది మేమే! అదే దీని దౌర్భాగ్యం" అన్నారు నిరసనగా దాని వైపు చూస్తూ.

అంత అందంగా ఉన్న ఆ విలువైన టీపాట్‌కి పట్టిన దౌర్భాగ్యం ఏమిటో నాకు సరిగా అర్థం కాలేదు. ఏం మాట్లాడాలో తోచక "అలాగా" అన్నా తెల్లబోతూ.

"సరే! ముందీ టీ తాగండి. తరువాత మీకు అసలైన 'టీ పాట్' చూపిస్తా. కానీ మీరు దానిని ముట్టుకోకూ డదు. ముట్టుకుంటే నిలబడి త్రాగడానికి లేదు" అంటూ నాకు ఆయన టీ, స్నాక్సు అందించారు.

టీలు అయ్యాక ఆయన నన్ను తీసుకెళ్లి ఒక గదిలో వారగా ఉన్న స్టూల్ మీద అందమైన ట్రేలో స్తబ్దంగా కూర్చుని ఉన్న ఒక నల్లని టీపాట్‌ని చూపించారు.

"ఏమిటి! ఇది ముట్టుకుంటే నిలబడదా?" ఆశ్చ ర్యంగా దాన్నే చూస్తూ అడిగా.

"మరీ అంత ఆశ్చర్యమేం లేదు. నిజానికి, అది యాంటిక్ అని తెలియడానికి అది కూడా ఒక రుజువే. అది అసలు సిసలు అక్బర్ కాలం నాటి 'టీ పాట్'. అప్పుడు తయారైన పాత్రలు ఇప్పటికీ ఇంకా నిలబడా లని మనం ఆశించకూడదు మరి!"

"మీరు దాన్ని ఎక్కడ కొన్నారు? ఈ ఊళ్లోనా?" పేల వంగా ఉంది నా ప్రశ్న నాకే.

"అబ్బే, లేదు అయ్యోరాత! ఇక్కడ మీకిలాంటి వస్తు వులు దొరుకుతాయనే అనుకుంటున్నారా? నిజం చెప్పా లంటే-దీన్ని కొన్న షాప్ ఏమంత పెద్దది కాదు. ఢిల్లీలో ఎర్రకోట వెనకాల ఒక చిన్న గల్లీలో ఉందది. అక్కడున్న వాటి మధ్య ఇది నత్తగుల్లల మధ్య ముత్యపుచిప్పలా ఒదిగి ఉండి, మా అదృష్టం కొద్దీ మా కళ్లబడింది. ఏమండీ, మీకా గల్లీ పేరు గుర్తుందా" అంటూ అడిగింది ఆమె.

"నాకు నోట్లో ఆడుతున్నట్లుంది గానీ పేరు బయ టికి రావడం లేదు. కావాలంటే తీసుకువెళ్లి చూపించగ లను ఆ యాంటిక్సు షాపు. చిన్న గది! కాని అక్కడున్న వన్నీ యాంటిక్సే! ఒక్కటి కూడా పగిలిపోంది లేదు"

ఏం మాట్లాడాలో తోచక "అయితే, ఈ టీ పాట్ మీరసలు వాడలేదన్నమాట" అన్నా.

"వాడడమా! యాంటిక్సు చూడడానికే గాని వాడ డానికి పనికిరావు. అలా పనికొస్తే అవి నిజమైన యాంటిక్సు కానే కావు." నా తెలివి తక్కువ ఆయనకు నవ్వు తెప్పించింది.

నల్లగా కిలం ఓడుతూ మకిలిపట్టినట్లున్న ఆ పాత్ర ఏ లోహంతో తయారైందన్నది నాకు అంతుపట్టలేదు. "అది వెండిదా?" యథాలాపంగా అడిగా. ఈ రోజు వీటి సంగతేమిటో కూలంకషంగా తెలుసుకోవాలని నిశ్చయించుకున్నా.

"అయ్యో! వెండి కా అందం ఆ నిగారింపు ఎక్కడా

స్తుంది! ఆ రోజుల్లో టీపాట్సు దుక్క ఇనుంతో తయారయ్యేవిట! ఇప్పుడది ఇమిటేట్ చెయ్యాలని చాలామంది ప్రయత్నించారుట. కానీ, ఆ రంగు ఆ నిగారింపు తేవడం వాళ్లతరం అవ్వలేదుట. చూశారూ, ఈ నిజమైన యాంటిక్సుతో వచ్చిన చిక్కే అది! వాటిని ఎవరూ ఇమిటేట్ చెయ్యలేరు. ఇప్పుడీ కొమ్ముబూరాయే చూడండి.." అంటూ బుచ్చబ్బాయిగారు గోడని మేకుకి వేలాడుతున్న ఒక వింత వస్తువుని ఇవతలకి తీశారు.

"శివాజీ రోజుల్లో వీరులు యుద్ధానికి వెడుతూ కొమ్ముబూరాలు ఊది తమ రాకను తెలియజేసేవారని మీరూ చిన్నప్పుడు హిస్టరీబుక్‌లో చదివే ఉంటారు. అప్పటిదే ఈ బూరా" అంటూ దాన్ని నాకు అందించారు.

దానిని అటూ ఇటూ త్రిప్పి చూశాను. వీరులు వీర విహారం చేస్తూ దానిని ఊదినప్పుడు లోపలంతా లాలాజలంతో నిండిపోయేది కాబోలు, అది లోపలంతా ఆకుపచ్చగా పాకుడు పట్టి ఉంది. బుచ్చబ్బాయిగారు దాన్ని గురించి చెప్పుకుపోతున్నారు. ఆయన కళ్లు ఏదో సాధించినట్లు మెరిసిపోతున్నాయి.

ఒకసారి ఒక హారన్ ఎక్స్పర్టు మనింటికి వచ్చి దీన్ని చూసి ఎంతో పొగిడాడు. ఇది మేమనుకుంటున్న టైం కంటే కూడా ఒక శతాబ్దానికి పూర్వందన్నాడు. ఒకవేళ ఇప్పుడు ఎవరైనా ఏ చచ్చిపోయిన ఆవుకొమ్మయినా వాడి, బూరాని తయారు చెయ్యగలరేమోగాని, లోపలి ఆకుపచ్చరంగుని మాత్రం ఛస్తే తెప్పించలేరని 'బెట్' కాశాడు. అంతవరకు ఇదేదో మామూలు యాంటిక్ అనుకుంటున్న మాకు ఆ మాత్రం దీనిమీద గౌరవం పెరిగిపోయింది.

ఊరికే నిలబడిపోతే బాగుండదని పెద్ద- ఏదో తెలిసిన వాడిలా పోజిచ్చి "దీన్ని మీరు బొంబాయిలో కొన్నారు కదూ" అన్నా.

బుచ్చబ్బాయిగారికి పొట్టచెక్కలయ్యేలా నవ్వు వచ్చింది. నవ్వి నవ్వి తమాయించుకుని "ఎబ్బే! బొంబాయా? అసంభవం! ఇలాంటి విలువైన వస్తువులు కొనాలంటే ఈ ఊరెంత పనికిమాలిందో బొంబాయీ అంతే! నిజాయితీగల వస్తువు అక్కడ ఒక్కటి కూడా దొరకదు. అన్నీ నకిలీవే. అక్కడేమైనా కొన్నారు గనక- శుద్ధదండుగ" అన్నారు.

"మరైతే వీటిని మీరు ఎక్కడ కొన్నారు?" ఆ గదిలోని అపురూప పురావస్తు సంపదని పరికించి చూస్తూ అడిగాను.

"ఈ గదిలో సామానంతా ఒక చోటనే కొన్నవి కావు. అక్కడా ఇక్కడా అని కాకుండా చాలా ఊళ్లు తిరిగి, మారుమూల ప్రదేశాలన్నీ గాలించి ఎంతో ప్రయాసతో సాధించినవి ఇవి! ఆ మూలనున్న చిన్న ముక్కాలిపీట ఉంది చూశారూ, అది ఒక గొడ్డపాకలో మూలగా పడిఉంటే చూసి, ఆనవాలు పట్టి తెచ్చుకున్నాం. అది సరే, ఆ మిగతావి రెండూ కూడా బాగున్నాయి కదూ! నిజానికి, రెండు ఒకేరకం వస్తువులు ఒకేచోట ఉండకూడదని ఎవరన్నారోగాని అదొక పెద్ద పొరపాటు. ఆ రెంటినీ చూడండి, తోవాన పదాల్లా ఎంతో అందంగా ఉండి, ఈ గదికే అందాన్నిచ్చాయనిపించటం లేదూ! కలకత్తాలో ఒక మారుమూల వీధిలో ఒక ముసలాయన వీటిని అమ్ముతూండగా చూసి, ఇట్టే పట్టేశాం. మేము అడిగినదానికి జవాబుగా ఆయన 'మహాప్రభో! ఇవి ఎప్పుడు చేశారో, ఎంత పాతవో నాకు తెలియదు. వంశానుక్రమంలో ఈ చెంబులు నాకు దక్కాయి' అని చెప్పాడు.

ఇవి పదిహేనో శతాబ్దంలోనైనా తయారై ఉండొచ్చు, మా పుణ్యం బాగుండి అంతకి పూర్వపువైనా కావచ్చు. అనిపించి వెంటనే బేరమైనా చెయ్యకుండా కొనేశా. బాగున్నాయి కదూ" అంటూ ఎంతో సంతోషంగా చెప్పారు ఆయన.

అంతలో, ఏదో పనిమీద బయటకు వెళ్లిన సావిత్రమ్మగారు తిరిగి వచ్చింది ఒక పోస్టుకార్డు చేత పట్టుకొని- "ఏమండోయ్! మా చెల్లెలు ఉత్తరం వ్రాసింది. ఇప్పుడది పాట్నాలో కొడుకు దగ్గర ఉంటోందని తెలుసుగా- అక్కడొక యాంటిక్ టేబుల్ చూసిందిట! అది చాలా అద్భుతంగా ఉందనీ, చూడగానే అది యాంటిక్ అని తెలిసిపోతోందనీ అది మన 'కార్డు రూమ్'లో ఉంటే ఆ గదికే నిండుతనం వస్తుందనీ మరీ మరీ వ్రాసింది. చదువుతా వినండి.

నేను ఉండడం అభ్యంతరమేమోనని లేచా. కానీ బుచ్చబ్బాయిగారు వారించి చెయ్యి పట్టుకు ఆపేశారు. "కూర్చో"మంటూ.

"మీరూ యాంటిక్సు కొనాలనుకుంటున్నారు కదా, మీరు కూడా వినడం మంచిది" అన్నారు సావిత్రమ్మగారు నా వైపు చూస్తూ. ఆపై చదవసాగారు.

"ఇది ఒక అద్భుతమైన కుర్చీపీట! మొదట్లో దానికి నాలుగు కాళ్లు ఉండే ఉంటాయి. ఇప్పటికీ రెండు ఉన్నాయిలే! నిజానికి ఇది మీ పుణ్యంకొద్దీ నాకు కనిపించింది అనిపిస్తోంది. పాట్నా అంటే పాటలీపుత్రం అని మీకూ తెలుసు కదా. దీని తీరు చూస్తూంటే ఈ కుర్చీపీట ఏ పురుషోత్తమ చక్రవర్తి కాలం నాటిదో అనిపించకమానదు. బహుశా విజేత అయిన అలెగ్జాండర్ చేసిన దురాక్రమణ సమయంలో దీని కాళ్లు విరిగి ఉంటాయి. షాపువాడు దీనిని గోడకి ఆనించి నిలబెట్టవచ్చునన్నాడు. చూడగానే దాని విలువ అందరికీ తెలిసేలా, సీలింగ్ నించి వేలాడే సన్నని వెండి గొలుసుల ఆధారంగా దానిని హాలు మధ్యలో నిలబెట్టవచ్చునని నా ఉద్దేశం! మీ అభిప్రాయం వెంటనే తెలియజేయండి"

"అద్భుతంగా లేదూ! వెంటనే వెళ్లి మా చెల్లికి టెలిగ్రాం యిచ్చి రండి, మనకది కావాలని. లేకపోతే వస్తువు చెయ్యిజారిపోగలదు" అంటూ సావిత్రమ్మ మొగుణ్ణి కంగారుపెట్టింది.

ఎప్పుడు లేద్దామా అని ఆరాటపడుతున్న నాకు అవకాశం దొరికింది. "నేనింక శలవు తీసుకుంటా" అంటూ లేచి నిలబడ్డా.

## స్లిమ్ అండ్ ట్రిమ్ సమీరా

చూడ్డానికి కాస్త బొద్దుగా వుండే సమీరా రెడ్డి తన పర్సనాలిటీ విషయమై బోల్డు బాధపడేది ఇంతకాలం. బిపాసా బసులాంటి పర్సనాలిటీ ఎంత బావుంటుందీ అని వాపోయింది కూడా. అయితే ప్రయత్నిస్తే సాధించలేనిది లేదన్నట్టు ఇప్పుడామె స్లిమ్ అండ్ ట్రిమ్‌గా మారింది. 'సూపర్ వుమన్' అనే సినిమాలో కావాల్సిన విధంగా తన బాడీని తగ్గించుకోడానికి తెగ కృషి చేసిందిట. మారిన ఈ ఫిగర్‌ని ఇలాగే కంటిన్యూ చేయదల్చుకున్నట్టు చెబుతోంది సమీర. కొన్ని ఎక్సర్‌సైజులు, యోగా ద్వారా తను ఆరు కిలోల వరకూ బరువు తగ్గానంటోంది సమీరారెడ్డి. శుభం.



భార్యాభర్తలు నన్ను సాగనంపుతూ ఒక అమూల్యమైన సలహా ఇచ్చారు. కలిసికట్టుగా తమని సంప్రదించకుండా ఏమీ కొనవద్దు అని.

పరస్పరం వీడ్కోలు చెప్పుకున్నాక బయటపడి ఊపిరి పీల్చుకున్నా. ఆ ఇంట్లో గాలి కూడా 'యాంటిక్సు' వాసనే మరి!

అక్కడితో 'యాంటిక్సు' అనబడే ఆ అపురూప వస్తువులు నాలా భవిష్యత్తు మీద ఆశలు పెట్టుకున్న సామాన్య మానవుల కోసం కాదని తెలుసుకున్నా. అంతలో సుబ్బలక్ష్మి పట్టుదల గుర్తొచ్చి మనసు నీరుగారిపోయింది.

"హా! ఓల్డు జంక్ ఫర్ న్యూ మనీ! హతోస్మి!"

('లాఫ్ విత్ లీకాక్' కథా సంకలనం నుండి- స్టీఫెన్ లీకాక్ సౌజన్యంతో)